సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 3 । జూన్ । 2025



నెల్లూరు, చిత్తూరు జట్ల ఘన విజయం
కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీలో నెల్లూరు, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. -IIలో



క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం
అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.159
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1921 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం రూ. 1,08,353



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సిద్దవటం: సిద్దవటం మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ. 1,08,353 వచ్చినట్లు ఆలయం ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 మార్చి 2025 నుంచి 2 జూన్ 2025 వరకు స్వామి వారి హుండీలో భక్తులు వేసిన కానుకల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు.కార్యక్రమంలో దేవదాయ శాఖ కొండ గంగమ్మ దేవస్థానం నందిమండల కార్యనిర్వహణాధికారి మారుతిప్రసాద్, సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది చంద్రా, అర్చకులు సుబ్రమణ్యం శర్మ, స్థానికులు వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ డీఐజీగా రవికిరణ్

కడప అర్బన్: కడప నగర శివార్లలో కేంద్ర కారాగారం పక్కనే వున్న జైళ్ల శాఖ రాయలసీమ డీఐజీగా ఎం.ఆర్ రవికిరణ్‌ను నియమించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు నేడో, రేపో అధికారికంగా రానున్నట్లు సమాచారం. ఈయన గతంలో కడప కేంద్ర కారాగారం సూపరింటిండెంట్‌గా విధులను నిర్వహించారు. ప్రస్తుతం కోస్తాంధ్ర ప్రాంతంలో జైళ్లశాఖ డీఐజీగా పనిచేస్తున్నారు.

ఖైదీలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో ఉన్న ఖైదీలకు మెరుగైన సదుపాయాలు అందించాలని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జైళ్ల శాఖ అధికారులతో కలిసి ఆయన కడప కేంద్రకారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందించే సదుపాయాలు వసతులపై ఆరా తీశారు. కేంద్రకారాగారం పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. రిమాండ్ ఖైదీ వివరాలు, శిక్ష అనుభవిస్తున్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్రకారాగారం సూపరింటిండెంట్ రాజేశ్వరరావు, జైలు అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకుఅవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటం: రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు.సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పీఎం కిసాన్ పథకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వరి, సజ్జ, చిరుధాన్యాల సాగు, మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు, విస్తీర్ణం పెంపు, ప్రకృతి వ్యవసాయ విధానాల వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త వీరయ్య మాట్లాడుతూ వరిలో పచ్చిరొట్ట ఎరువుల పంట పూత దశలో ఉన్నపుడు కలియదున్నాలని, 2 కిలోలు సూపర్ వేసి దున్నితే త్వరగా కుళ్లుతుందన్నారు. విత్తనశుద్ధిని తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఉద్యానాధికారి జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో జూన్, జూలైలో ముదురు కొమ్మలను కత్తిరించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్త ఖురేషి, శాస్త్రవేత్త మానస, జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ, స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికి సంక్షామం!

- అధికారంలోకి రాగానే సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- గతంలో ఇంటింటికి సేవలు అందించిన వలంటీర్లు
- కూటమి సర్కారులో ఏ పని కావాలన్నా కార్యాలయాల దగ్గరకు పరుగు పెడుతున్న జనం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం




జిల్లాలో వార్డు సచివాలయాలు: 414
గ్రామ సచివాలయాలు: 87
సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది: 5230
గతంలో పనిచేస్తున్న మొత్తం వలంటీర్లు: 8658

సాక్షి రాయచోటి: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆనాడు కళ్లముందే ఆవిష్కృతమైంది. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న పేదల బతుకుల్లో వైఎస్ జగన్ సర్కార్ స్వర్ణయుగం తీసుకొచ్చింది. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల కొరకు ఏర్పడిన వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. గాంధీజీ ఆశయాలను నెరవేరుస్తూ ప్రజలకు వైఎస్ జగన్ సర్కార్ సుపరిపాలనను అందించింది. ఎక్కడికక్కడ వలంటీర్ల వ్యవస్థతోపాటు సచివాలయాల ఏర్పాటుతో సమాజంలో జీవన స్థితిగతుల రూపురేఖలే మారిపోయాయి. సమస్య ఏదైనా పరిష్కారం కూడా అక్కడికక్కడే లభిస్తుండడంతో ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేసేవారు. అయితే కాలం మారింది...2024లో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో పూర్తిగా భిన్నమైన పరిస్థితులు తలెత్తాయి. పేదల సంక్షేమం గాలిలో దీపంలా మారింది. గత ప్రభుత్వం పేరు చెబుతూ పథకాల పేర్లు మార్చడమే కాకుండా వాటిని నిర్వీర్యం చేస్తున్నారు.

వలంటీర్ల వ్యవస్థకు మంగళం

రాష్ట్రంలో 2024లో సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడింది. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే వారికి ఇస్తున్న గౌరవ వేతనం రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని గొప్పలు చెప్పి ప్రస్తుతం వలంటీర్ల మాట ఎత్తకుండా విస్మరిస్తున్నారు. కనీసం వారికి ఇచ్చిన మాట కోసమైనా విధుల్లోకి తీసుకుంటారనుకున్నా ఏ ఒక్కరినీ తీసుకోలేదు. అంతేకాకుండా సచివాలయ వ్యవస్థలో కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టి వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంలా సచివాలయ ఉద్యోగులను నియమించి ఒక చరిత్ర సృష్టించారు.



అయితే ప్రస్తుత సర్కార్ ఉద్యోగుల విషయంలో కూడా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఉద్యోగ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. ఇటీవలి కాలంలో వారిపై వేధింపులతోపాటు పార్టీ కార్యక్రమాలకు సహకరించలేదన్న కోపంతో టీడీపీ శ్రేణులు దుర్భాష లాడిన ఘటనలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సచివాలయాల ద్వారా ప్రజలకు సుమారు 540కి పైగా సేవలు అందించే పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు సచివాలయాల్లో అంతంత మాత్రంగానే సేవలు అందిస్తున్నట్లు ప్రత్యక్షంగా స్పష్టమవుతోంది.

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ల సేవలు



వైఎస్సార్ సీపీ హయాంలో వలంటీర్లు ఇంటింటికి సేవలు అందించారు. అందులోనూ కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సందర్భంలోనూ....ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వారు సేవలు అందించారు. ప్రజలకు సంబంధించి ఏ పని కావాలన్నా నేరుగా వారే చేసి పెట్టేవారు. వీధిలో మంచినీరు వదిలే సమయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం, సర్టిఫికెట్లు నేరుగా ఇంటికే తెచ్చి ఇవ్వడం వంటి మహోన్నత కార్యక్రమాలు చేసి మంచి సేవకులుగా గుర్తింపు పొందిన వలంటీర్లు ప్రసుత్తం ఇంటికే పరిమితమయ్యారు. కూటమి సర్కార్ పుణ్యమా అని హామీ అమలు చేయకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నాడు వలంటీర్ల ద్వారా విశేష సేవలు పొందిన ప్రజలు, ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరగాలి



తన కుమారుడు ఇంటర్ మీడియట్ పాసయ్యాడు. ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకుందామని గ్రామ సచివాలయం వద్దకు ఈబీసీ సర్టిఫికెట్ కోసం పలుమార్లు వెళ్లినా పనులు కాలేదు. ఉన్న డిజిటల్ అసిస్టెంటును జ్యోతి సచివాలయానికి డిప్టేషన్ వేశారు. జగనన్న పాలనలో సచివాలయం చుట్టూ తిరగకుండానే గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకెళ్లి వారే రెండు రోజుల్లో సర్టిఫికెట్లు ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. ఈ ప్రభుత్వంలో సర్టిఫికెట్ పొందాలంటే కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తుంది. **– బండి లక్ష్మిదేవి, వంతాటిపల్లె, సిద్దవటం మండలం**

వైఎస్ జగన్ హయాంలో విశేష సేవలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి విశేష సేవలు అందించారు. స్థానికంగా సచివాలయాలు ఏర్పాటుతోపాటు వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. వివిధ పనులకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. ముఖ్యంగా కరోనా లాంటి విపత్కర సమయంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయం. కూటమి సర్కార్ తీరుతో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. **– యు.బాలాజీ, గాలివీడు**

మాట ఇచ్చి మోసం చేశారు



ఎన్నికల్లో వలంటీర్లను తొలగించమని.. రూ.5 వేలు కాదు రూ. 10,000 గౌరవవేతనం ఇస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చాక మోసం చేశారు. జగనన్న ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సేవలందించాం.ఎన్నికల సమయంలో వలంటీర్లను మచ్చిక చేసుకోవడానికి రూ.10 వేల పేరుతో దగా చేశారు. **–ధనుంజయ, వలంటీర్, సిఎం కొత్తపల్లె, సంబేపల్లె మండలం**

ఉద్యోగభద్రత కల్పించకపోవడం దారుణం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ సేవలను వినియోగించకోకపోగా ఉద్యోగ భద్రత కూడా కల్పించకపోవడం దారుణం. అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పి అధికారం చేపట్టాక ఏకంగా వలంటీర్ల ఊసే ఎత్తకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే చెల్లు. **– ఎస్.మహబూబ్‌బాషా, వలంటీర్, కొత్తపేట స్ట్రీట్, రాయచోటి**

కేంద్రీయ విద్యాలయానికి కదలిక!

- వీడిన స్థలగ్రహణం
- ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో మంజూరు
- పోలిగుట్ట వద్దనే స్థలం ఎంపిక



కేంద్రీయవిద్యాలయం

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం రాజంపేటలోని కేంద్రీయ విద్యాలయానికి(కేవీ) స్థల గ్రహణం వీడింది. ఈ విద్యాలయం మంజూరుకు లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఫలితంగా 2016లో రాజంపేటలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటైంది. దీంతో రాజంపేట పరిసర ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యను చదువుకొనే అవకాశం కలిగింది.

తొమ్మిదేళ్లుగా...

కేంద్రీయ విద్యాలయం తొమ్మిదేళ్లుగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాంపస్ వెనుక వైపు ఉన్న భవనాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

స్థల ఎంపికలో జాప్యం..

శాశ్వత భవనాల నిర్మాణం కదలిక లేకపోవడానికి ప్రధాన కారణంగా స్థల ఎంపిక నిలుస్తోంది. ముందుగా చుండువారిపల్లె సమీపంలో స్థలాన్ని కేటాయించారు అప్పట్లో అక్కడ కేవీ నిర్మాణం చేపట్టే అవకాశం లేకపోయింది. దీంతో తాత్కాలికంగా సరస్వతీపురంలోని ఒకప్పటి హాస్టల్ భవనంలోనే కొనసాగే పరిస్థితి ఏర్పడింది. శాశ్వత నిర్మాణం ప్రశ్నార్థకంగా మారుతూవచ్చింది.

- రాజంపేట-నెల్లూరు రహదారిలోని పోలిగుట్ట వద్దే ఎట్టకేలకు శాశ్వత నిర్మాణానికి స్థలం ఎంపిక చేశారు. పోలి పంచాయతీ పరిధిలోని 1815-5 నంబరు, 1615-6 నంబరులో 5 ఎకరాలు కేవీ సొంత భవన నిర్మాణాలకు కేటాయించారు. ఈ స్థలాన్నే ఫైనల్ చేశారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దారు పీరుమున్నీ ధృవీకరించారు.

నిర్మాణానికి రూ.20కోట్ల నిధుల రెడీ..

కేంద్రీయ విద్యాలయం సొంత భవనాల నిర్మాణానికి రూ.20కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్థలం ఎంపిక సమస్యతో ఈ నిధులు వ్యయం కాకుండా ఉండిపోయాయి.ప్రసుతం పనులు చేపట్టడానికి మార్గం సుగమమైంది.

జేఈఈ అడ్వాన్స్‌లో మెరిశారు

ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఇందులో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కష్టపడి చదివారు. ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు.

పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురానికి చెందిన సాయి అనిష్ రెడ్డి, నాగిరెడ్డి లిఖిత్‌రెడ్డి, సిద్దవటానికి చెందిన కృష్ణహర్షిత్, చెన్నూరు మండలం కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన మధు మన్మోహిత్ రెడ్డిలు మంచి ర్యాంకులతో మెరిశారు.

సాయి అనిష్ ప్రతిభ



సింహాద్రిపురం: జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాలలో పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురంకు డాక్టర్ శివన్నారాయణరెడ్డి, డాక్టర్ మాధవి రెడ్డిల కుమారుడు సాయి అనిష్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. ఆల్ ఇండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని సాయి అనిష్‌రెడ్డి తెలిపారు.

- సింహాద్రిపురానికి చెందిన నాగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నవీనాల కుమారుడు నాగిరెడ్డి లిఖిత్‌రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 512వ ర్యాంక్ సాధించారు.లిఖిత్‌రెడ్డి ప్రతిభ చూపడంపట్ల గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



రాణించిన మధుమన్మోహిత్

వల్లూరు(చెన్నూరు): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన మధు మన్మోహిత్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా స్థాయిలో 303 వ ర్యాంక్ సాధించాడు. మధు మన్మోహిత్ రెడ్డి తల్లి ప్రశాంతి పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తుండగా, తండ్రి మధు వేణు గోపాల్ రెడ్డి కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ చదివిన మధు మన్మోహిత్ రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో కెమిస్ట్రీ సబ్జెక్టులో 80 మార్కులు, ఫిజిక్స్‌లో 87 మార్కులు, మ్యాథ్స్‌లో 82 మార్కులతో మొత్తం 249 మార్కులు సాధించాడు. దీంతో ఇతడు సీఆర్ఎల్ ర్యాంకు 303 సాధించాడు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యంగా తెలిపాడు. తమ కుమారుడు జేఈఈ అడ్వాన్స్‌డ్ లో ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు మధు వేణుగోపాల్ రెడ్డి, ప్రశాంతిలు ఆనందం వ్యక్తం చేశారు. కాగా అతడు ఇంటర్లో 991 మార్కులు సాధించాడు.



కృష్ణహర్షిత్‌కు 139వ ర్యాంకు



సిద్దవటం: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సిద్దవటానికి చెందిన మంచాల కృష్ణ హర్షిత్ జనరల్ కేటగిరీలో ఆల్ ఇండియాలో 139వ ర్యాంకు సాధించారు. ఈయన తండ్రి మంచాల ఈశ్వరయ్య కడపలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి రాధిక గృహిణి తమ కుమారుడు కృషి, పట్టుదలతో జేఈఈలో మంచి ర్యాంకు సాధించినందుకు తల్లిదండ్రులు కుమారుడికి అభినందించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యున్నత నైపుణ్యం పొంది, ఏ1లో ఉన్నతంగా రాణించాలన్నదే తన లక్ష్యమని ర్యాంకర్ మంచాల కృష్ణ హర్షిత్ తెలిపారు.

రేపు ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్



రాజంపేట టౌన్: జిల్లాలోని ఐటీఐలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం పది గంటల నుంచి రాజంపేట పట్టణం రెడ్డివారివీధిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ రామిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లె, పీలేరులోని మూడు ప్రభుత్వ ఐటీఐలతో పాటు పన్నెండు ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయన్నారు. వీటిల్లో ట్రేడ్‌ల ఖాళీలను బట్టి అభ్యర్థులు తమకు నచ్చిన ట్రేడ్‌ను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. మెరిట్ నంబర్ 1 నుంచి 50 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మెరిట్ నంబర్ 51 నుంచి 98 నంబర్ వరకు 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు టెన్త్ మార్కులలిస్టు, 2025లో ఉత్తీర్ణులైన వారు అయితే మార్కుల జాబితాపై తమ పాఠశాల హెడ్ మాస్టర్‌తో అటెస్టెడ్ చేయించి తీసుకురావాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కుల ధృవీకరణ పత్రం, అగ్రవర్ణాలకు చెందిన పేదలు తహసీల్దార్ జారీ చేసిన ఈడబ్ల్యుఎస్ సర్టిపికెట్, దివ్యాంగులు సంబంధిత అధికారి జారీ చేసిన ధృవీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లకు సంబంధించి 1716 సీట్లు ఉన్నాయన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

రాయచోటి: ప్రజలు సంతృప్తి చెందేలా పీజీఆర్ఎస్ అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించరు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

వినతులు: రాయచోటి పట్టణానికి చెందిన ఫల్లా వనజ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న తమకు ఇంటిస్థలం, ప్రభుత్వం తరపున ఇంటిని మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సుండుపల్లి మండలం, కొండల తూర్పు గ్రామానికి చెందిన పి లక్ష్మీదేవి ఒంటరి మహిళగా జీవనం సాగిస్తున్న తనకు బియ్యం కార్డు, రేషన్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వేకోడూరు మండలం ఎస్. కొత్తపల్లి గ్రామానికి చెందిన కె వెంకట నరసమ్మ పక్షవాతంతో బాధపడుతున్న తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ , ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.4.29 లక్షల విలువైన జీవనోపాధి సాధనాలు పంపిణీ

ప్రభుత్వం ద్వారా అందిస్తున్న జీవనోపాధి సాధనాలను సద్వినియోగం చేసుకొని తమ జీవితాన్ని మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారంకలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు రూ.4.29 లక్షల విలువైన జీవనోపాధి సహాయక ఉపకరణాలను లబ్దిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ముగ్గురు లబ్దిదారులకు ఒక్కొక్కటి రూ.90 వేలు విలువ చేసే 3 ఎలక్ట్రికల్ రెట్రో ఫిట్టెడ్ మూడు చక్రాల స్కూటర్లు, ఇద్దరికి ఒక్కొక్కటి రూ.42 వేలు విలువ గల 2 బ్యాటరీ ఆధారిత ట్రై సైకిళ్లు, ఒకరికి రూ.75 వేలు విలువ చేసే హైటెక్ హైడ్రాలిక్ కృత్రిమ కాలు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు.జేసీ ఆదర్శరాజేంద్రన్ మాట్లాడుతూ ఈ వాహనాలు, కృత్రిమ కాలు వారి స్వయం ఉపాధికి తోడ్పాటును అందిస్తాయని పేర్కొన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

రాయచోటి: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలలో అవగాహన కల్పించి సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టలేషన్ ఖర్చు, సబ్సిడీల గురించి ప్రజలకు వివరించి రిజిస్ట్రేషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్ శాఖ ఎస్‌ఈ, ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది జిల్లాలో సోలార్ ఇన్‌స్టాల్ చేసే వెండర్లు తదితరులతో జిల్లాలో సీఎం సూర్యఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు ప్రత్యేకంగా నూతన విధానాన్ని తీసుకురానున్నందున బీసీ, ఓసీల మీద దృష్టి సారించాలన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజలతో మట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: ప్రజా వేదిక ద్వారా అందుతున్న ప్రజా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. రాయచోటి టౌన్‌కు చెందిన వికలాంగురాలు కాత్యాయని సమ్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆమె వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి చట్ట పరిధిలో ఆమె సమస్యను పరిష్కరించాలని రాయచోటి అర్బన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవకు సిద్ధంగా ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ చేశారు. సోమవారం రాత్రి మూల విరాట్ స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. పల్లకీల సేవలో స్థానిక భక్తులతో పాటు కర్ణాటకకు చెందిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

యోగా కోసం సిద్దవటం కోటలో స్థల పరిశీలన



సిద్దవటం కోటలో స్థలాన్ని పరిశీలిస్తున్న కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్

సిద్దవటం : యోగా నిర్వహణ కోసం సిద్దవటంలోని మట్లిరాజుల కోటలో స్థలాన్ని సోమవారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర 2025 జిల్లా స్థాయి కార్యక్రమాల్లో భాగంగా సిద్దవటం లోని గార్డన్ స్థలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఏఓ శంకరయ్య, స్థానిక తహసీల్దార్ తిరుమల బాబు, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ కేశవులు, పురావస్తు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన మధు

మదనపల్లె రూరల్ : పోలీసులకు తమ గురించి సమాచారం ఇచ్చాడనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తిపై బీరుబాటిల్‌తో దాడిచేసిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. మంజునాథ కాలనీలో టూ టౌన్ పోలీసులు ఆదివారం సాయంత్రం మద్యం, గంజాయి వినియోగం, విక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం స్థానికుడైన మధు(42)తో మాట్లాడి వెళ్లారు. దీంతో అదే ప్రాంతానికి చెందిన ఆనంద్, మల్లయ్య, చంద్ర తదితరులు పోలీసులకు సమాచారం అందించి ఉంటాడనే అనుమానంతో మధుతో గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా బీరు బాటిల్‌తో దాడిచేసి కొట్టారు. దాడిలో మధు తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుది అరాచక, దుర్మార్గ పాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన చంద్రబాబు, కూటమి పాలనలో గత ఏడాది కాలంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి దూరం చేసి వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయినా ఇంతవరకు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపి వేసి అన్ని వర్గాల ప్రజల జీవితాలతో చంద్రబాబు ఆడుకొంటున్నారని ఆరోపించారు. ఏడాది పాలనలో విద్య, వైద్య, సంక్షేమాన్ని ధ్వంసం చేశారన్నారు. దాడులు, కేసులు తప్ప ఏమీ లేవని పేర్కొన్నారు. ప్రజల నడ్డి విరచడమే కాకుండా ఏడాదిలో రాష్ట్రంలో 760 హత్యా యత్నాలు, 365 హత్యలు, మహిళల అదృశ్యం కేసులు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. ప్రశ్నించే పవన్‌కళ్యాణ్ ఏమయ్యారో తెలీలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఈనె 4 న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు యలగచెర్ల శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, నందాబాల, సుబ్బరామరాజు, గునిశెట్టి రమేష్, సిద్ధూ రాయల్, కరీముల్లా, శంకరయ్య, మధు, ప్రదీప్, డీవీ రమణ పాల్గొన్నారు.

గాలిలో కలిసిన సూపర్ సిక్స్ హామీలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం రాయచోటిలో విడుదల చేసిన ప్రకటనలో అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల పంటల సాగుకు భరోసా లేదు.. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు.. విద్యార్థులకు తల్లికి వందనం, నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు 143 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఏడాది కాలంలోనే రూ.1.50 లక్షల కోట్లను కూటమి ప్రభుత్వం అప్పులు చేసినప్పటికీ పెన్షన్ తప్ప ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. పదవ తరగతి మూల్యాంకనంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జూన్ 4వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు రాయచోటి పట్టణంలోని కడప రహదారి మార్గం రింగ్‌రోడ్డు అన్నమయ్య సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి తదితర నేతలు హాజరు కానున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పథకం ప్రకారం రెచ్చగొట్టి.. కేసుల్లో ఇరికించి..

9 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసు నమోదు

రాయచోటి : వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి ఘర్షణకు దిగిన వారిపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శిస్తున్నారు. కంచాలమ్మ గండి చెరువులో గత కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు జేసీబీలు పెట్టి ట్రాక్టర్ల సాయంతో మట్టిని దోచుకెళ్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన పాపానికి స్థానిక రైతులు పొలాలకు ఎరువుగా మట్టిని తీసుకెళ్లినా ఓర్వలేని టీడీపీ నాయకులు వారిపై దాడికి తెగబడుతున్నారు. గ్రామంలో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ బలం అధికంగా ఉండటంతో వారిపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేయాలన్నది వారి ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం చెరువులో మట్టి తోలుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో టీడీపీ వారు ఘర్షణకు దిగారు. మట్టిని తమ అనుమతి లేకుండా తోలుకోవడానికి వీలు లేదని నిలదీశారు. ఇదే విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఘర్షణలో టీడీపీకి చెందిన ఒక్కరు గాయపడ్డారంటూ ఆసుపత్రికిలో చేరి గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులపైన కేసు నమోదు చేయించారు. టి.ఆనంద్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, దుగ్గిరెడ్డి కోటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అబ్బవరం రెడ్డయ్య, పి.కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలపైన కేసులు నమోదు చేయించి వారిని అరెస్టు చేయించే వరకు నిద్రపోమంటూ పోలీసులపైన ఒత్తిడి తెచ్చారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాన్ని చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

పట్టా భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లుకు చెందిన తలారీ ఆదెన్న కుమారుడు తలారీ ఉత్తన్న అనే రైతు గ్రానైట్ క్వారీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరిపై సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు కథనం మేరకు వివరాలిలా... తన కుటుంబానికి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిని క్వారీ లీజుదారులు ఆక్రమించుకున్నారని ఆరోపించాడు. అంతేగాక క్వారీ నుంచి వెలువడే పేలుళ్ల శబ్దాల కారణంగా నివాస గృహాలు బీటలు వారడమే గాక రైతుల బోరు బావుల్లోని మోటార్లు కదలి పైపులు పూడుకు పోతున్నా పట్టించుకునే వారు లేరని వాపోయాడు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా క్వారీ పనులను రద్దు చేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపాడు.

క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

కలెక్టర్ చామకూరి శ్రీధర్



టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ''టీబీ ముక్త్ భారత్ అభియాన్'' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టీబీ రహిత భారత్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక దశలోనే టీబీ వ్యాధిని గుర్తించి చికిత్స చేయడం, క్షయ వ్యాధి వలన కలిగే మరణాలను తగ్గించడం, 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో క్షయ వ్యాధిని నిర్మూలించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఉదారత చాటుకున్న కలెక్టర్, జేసీ..

జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు ఒక్కొక్కరు ముగ్గురు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారి పోషకాహార కోసం తమ సొంత నిధులు రూ.10 వేలు అందించారు. డీఆర్ఓ మధుసూదనరావు, ఆర్డీఓ శ్రీనివాసులు ఒక్కొక్కరు ఇద్దరి చొప్పున దత్తత తీసుకుని రూ.5 వేలు అందించారు. జిల్లా అధికారులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించి క్షయ రహిత జిల్లా కోసం కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన నిమిత్తం రూపొందించిన ప్రచార పోస్టర్లను జేసీ, డీఆర్ఓ, ఆర్డీఓ, వైద్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5న భారీ ప్లాంటేషన్ గ్రీన్ డ్రైవ్

జిల్లా అటవీ అధికారి జగన్నాథ సింగ్



రాజంపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న భారీ ప్లాంటేషన్ గ్రీన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథసింగ్ తెలిపారు. సోమవారం తన చాంబరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 28 విభాగాలతో జిల్లా వ్యాప్తంగా ప్లాంటేషన్ డ్రైవ్ చేస్తామన్నారు. జిల్లాలో 50 శాతం పచ్చదనం సాధించాలనే ప్రధాన లక్ష్యంతో అటవీశాఖ, వివిధ శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అంతటా 4.5 లక్షల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. రాజంపేట–రాయచోటి రహదారిలోని ఎస్ఆర్‌పాళెం నగరవనంలో జిల్లా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఎర్రచందనం, వేప, టేకు, నేరెడు, ఉసిరి, వెదురు, చింత, దానిమ్మ, ఎగిసి, గంగరావి, మారేడు, సీతాఫలం, తాండ్ర, శ్రీగంధం, తెల్లమద్ది, మునసంపెంగా, బహునీయతో పాటు మరికొన్ని మొక్కలను నాటుతామన్నారు. ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలు స్వరాన్ని వినిపించాలని.. అన్నమయ్య హరిత విప్లవంలో భాగం కావాలని ఆయన కోరారు.

మద్యం షాపులో చోరీ



సీసీ ఫుటేజీను పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శ్రీ కృష్ణ మద్యం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మద్యం షాపు యజమాని రామసుబ్బారెడ్డి తమ షాపులో రూ. 30 వేలు విలువచేసే మద్య బాటిళ్లు, క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 5వేలు నగదును అపహరించారని ఫిర్యాదు చేశారన్నారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజీను పరిశీలించామన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



హిటాచీతో టిప్పర్‌లోకి వేస్తున్న ఇసుక

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తంబళ్లపల్లి నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య టీడీపీ నేత కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ములకలచెరువుకు చెందిన ఈ కీలక నేత ఆదేశాలతోనే అధికారులు సైతం అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ జీ హుజూర్ అంటూ తలాడిస్తున్నారు. ఇసుక అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలవడంతో ప్రజలంతా అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా విస్తుపోతున్నారు. హంద్రీ నీవా కాలువ పనుల పేరుతో ఇసుకను అక్రమంగా దోచేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండటం గమనార్హం. ములకలచెరువు మండలంలోని రామానాయునికోట ఏటి వద్ద పెద్ద ఎత్తున హిటాచీ యంత్రాలతో ఇసుకను టిప్పర్లలో నింపి పగలే అక్రమంగా తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు వాటిని నిలువరించే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్ స్పందించి కాలువ పనుల పేరుతో ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారి నిజాయితీ



బంగారు ఆభరణాన్ని అందిస్తున్న బాలుడు

రాయచోటి టౌన్ : ఓ చిన్నారి బాలుడు తన నిజాయితీని చాటుకొని అందరినీ అబ్బురపరిచాడు. సోమవారం రాత్రి రాయచోటి పట్టణంలోని విశాల్ మార్ట్‌కు అబ్దుల్ అలీమ్ తన తండ్రి అబ్దుల్ సమద్‌తో కలసి షాపింగ్‌కు వెళ్లాడు. తనకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్న సమయంలో ఆ ఫ్లోర్‌లో ఐదు గ్రాముల బంగారు ఆభరణం కనిపించింది. ఈ విషయం తన తండ్రికి చెప్పి వెంటనే మార్ట్ మేనేజర్‌కు అందజేశారు. ఆ ఆభరణాన్ని చూసిన మేనేజర్ ఆ బాలుడిని మెచ్చుకొని ఆలింగనం చేసుకున్నాడు. బాలుడి నిజాయితీని అక్కడున్న ప్రతి ఒక్కరూ అభినందించారు.

అల్ల నేరేడుకు ఊజి దెబ్బ

- కాయలు పక్వానికి రాకుండానే కుళ్లిపోతున్న వైనం
- రైతులను వెంటాడుతున్న గుబులు
- సస్యరక్షణ పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు



రాయచోటి : అల్ల నేరేడు శక్తినందించి ఆరోగ్యానికి మేలు చేయడమే కాదు కొన్ని రకాల రోగాలను నియంత్రించే శక్తి నేరేడు సొంతం. ఒక్క పండే కాదు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అక్సాలిక్ టాన్నిక్ ఆమ్లం, విటమిన్లు, క్రోమియం వంటివి నేరేడులో పుష్కలం. అలాంటి అల్ల నేరేడుకు తెగుళ్ల రూపంలో ఊజి పురుగులు వెంటాడుతున్నాయి. నిగనిగలాడే నేరేడు పండును సంతృప్తిగా తిందామన్న వారికి పురుగుల రూపంలో భయపెడుతోంది. నేరేడు పండ్లపై ఈ పురుగులు దాడి చేస్తుండటంతో కాయలు పక్వానికి చేరి మాగకుండానే కుళ్లిపోతున్నాయి. ఫలితంగా సాగు, సస్యరక్షణకు పెట్టిన ఖర్చులు కూడా వస్తాయో లేదో అన్న భయం పట్టుకుంది. కొద్దికొద్దిగా దిగుబడి వచ్చినా ప్రస్తుతం నేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో పండ్లు రూ.250లు నుంచి రూ.300లు పైనే అమ్ముతుండటంతో నేరేడు తోటలను సాగు చేసిన రైతులు ఆనందపడుతున్న వేల ఊజీ పురుగుల దాడి వారిని కలవరపాటుకు గురి చేస్తోంది. పండ్లతోటల సాగులో భాగంగా మామిడి, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలతోపాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేరేడు పండ్లతోటల పెంపకానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో కూడా అధికంగా సాగులో ఉన్న నేరేడు పండ్లను ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఫలితమివ్వని మందుల పిచికారీ..

అల్లనేరేడుకు సోకుతున్న తెగుళ్ల, పురుగుల నివారణకు రకరకాల మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. గుత్తులు గుత్తులుగా కాయలు కాసి మాగకుండానే మగ్గిపోతుండటాన్ని చూసి రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే మామిడి పంటకు ధరలు లేక కుంగిపోతున్న రైతులు అల్లనేరేడు పంటపై ఊజీ పురుగుల దాడి చూసి వాటి సాగుకు, సంరక్షణకు పెట్టిన డబ్బులు కూడా వచ్చే అవకాశాలు లేవని మథనపడుతున్నారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల ఘన విజయం



ఐదు వికెట్లు తీసుకున్న నెల్లూరు జట్టు బౌలర్ ఎన్. భార్గవ్



83 పరుగులు చేసిన నెల్లూరు జట్టు బ్యాట్స్‌మెన్ నిఖిలేశ్వర్ రెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీలో నెల్లూరు, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. సోమవారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 225 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 49.4 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె. నిఖిలేశ్వర్ రెడ్డి 83, జి. మన్విత్ రెడ్డి 67, సోహన్ వర్మ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి. కనీష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీసుకున్నాడు. పి. సాబ్జాన్‌బాషా 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 388 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 36.3 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలయింది. ఆ జట్టులోని పి. కనీష్ 60, పి. సాబ్జాన్ బాషా 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎన్. భార్గవ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఎస్ అఖిల్ సాలుంకే 2, సయ్యద్ అతిక్ సల్మాన్ 2 వికెట్లు తీసుకున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప జట్టుపై చిత్తూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఏ. శివకేశవ రాయల్ 63, సి. విజయ్ రామిరెడ్డి 35 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మహమ్మద్ 4, పి. అచ్యుతానంద 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 262 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ 84, నికిత్ గౌడ్ 54 పరుగులు చేశారు. కడప జట్టులోని ఏ. నాగ కుళ్లాయప్ప 3, షేక్ ఆదిల్ హుస్సేన్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఇరువురు చైన్ స్నాచర్ల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో త్రీ టౌన్ పోలీసులు ఇరువురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చింతకొమ్మదిన్నె మండలంలోని మర్రి జాషువ, మైదుకూరుకు చెందిన మర్రి జయప్రకాష్‌లు అన్నదమ్ములు. వీరు జులాయిగా తిరుగుతుంటారు. ఈ క్రమంలో త్రీ టౌన్ పరిధిలోని వెంకటేశ్వర ఆలయం సమీపంలో, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయల్‌కౌంటీ వద్ద ఇటీవల మహిళల మెడలో నుంచి బంగారు చైన్‌లను లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్ స్టేషన్‌లలో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరూ సుందరాచార్యుల వీధి మలుపు వద్ద ఉండగా సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు హనుమంతు, వెంకటరెడ్డి, సిబ్బంది దస్తగిరి, సుబ్రమణ్యం, కుమార్, హోంగార్డు జనార్దన్‌రెడ్డిలతో కలిసి వెళ్లి సోమవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పోట్లదుర్తిలో ఉద్రిక్తత

- పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- ఆలయ పరిరక్షణ కోసమే అంటున్న సురేష్ నాయుడు



ప్రహరీ నిర్మాణం చేపట్టొద్దని సంఘటన స్థలంలో బైఠాయించిన గ్రామస్తులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు సంబంధించి సోమవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ముందు జాగ్రత్త చర్యగా ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోట్లదుర్తి గ్రామానికి చెందిన అనాకపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ నాయుడు తన కోటా కింద గ్రామంలోని పెద్దమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టేందుకు ప్రస్తుతం పూనుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించి 3.09 ఎకరాల భూమి ఉందని, అందులో కొంత భూమిని ఆక్రమణదారులు కబ్జా చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు దేవాదాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు గతంలో ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించారు. ఆలయానికి సంబంధించిన మొత్తం స్థలంలో ఆక్రమణలను తొలగించిన తర్వాతే అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. ఆలయ పరిరక్షణ కోసమే ప్రస్తుతం ఉన్న స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎంపీ సోదరుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం రమేష్ నాయుడు సంఘటన స్థలానికి వచ్చి చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహింపజేయడంతోపాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. ఎంపీ నిధులతో ఆలయ పరిరక్షణ కోసం ప్రహరీని నిర్మించాలని నిర్ణయించామన్నారు. గతంలో గ్రామస్తులు ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుని న్యాయస్థానంలో రెండు పిటీషన్లు వేశారని వాటిని న్యాయ స్థానం కొట్టివేసిందన్నారు. న్యాయస్థానం సూచన మేరకే పనులు చేపడుతున్నామని, ఇందులో తమకు ఎలాంటి స్వార్థం లేదని సురేష్‌నాయుడు తెలిపారు. ప్రహరీని నిర్మించి తీరుతామన్నారు.



సంఘటన స్థలంలో సీఎం సురేష్ నాయుడు



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం